క్లుప్తంగా

వైభవంగా పుష్ప యాగోత్సవం

మచిలీపట్నంటౌన్: స్థానిక బచ్చుపేటలోని వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారికి పుష్పయాగోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. రాత్రికి భోగ శ్రీనివాసమూర్తులకు ద్వాదశ ప్రదక్షిణలు, అనంతరం స్వామివార్ల పవళింపు సేవ కార్యక్రమం జరిగింది. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, చైర్మన్ ముత్తేవి రవికాంత్, కార్యనిర్వహణాధికారి ఎస్ఎస్ చక్రధరరావు పర్యవేక్షించారు.

టెన్త్ పరీక్షలకు ఇద్దరు గైర్హాజరు

మోపిదేవి: మోపిదేవి, పెదకళ్లేపల్లి, గురుకుల పాఠశాలల్లో నిర్వహిస్తున్న పదో పరీక్షలకు శనివారం ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారు. మోపిదేవి జెడ్పీ పాఠశాలలో 179 మందికి గాను 179 మంది విద్యార్థులు, పెదకళ్లేపల్లి జెడ్పీ పాఠశాలలో 71 మంది విద్యార్థులకు గాను 69 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఇద్దరు గైర్హాజరయ్యారు. గురుకుల పాఠశాలలో 93కి 93 మంది విద్యార్థులు పరీక్ష రాశారని ఆయా పాఠశాలల చీఫ్ సూపరింటెండెంట్స్ కొడాలి బాల నాగేశ్వరశర్మ, కృష్ణ ప్రసాద్, ఎ. వెంకటేశ్వరరావు తెలిపారు.

అన్నసమారాధన



పెడన: బస్టాండ్ సమీపంలోని గణపతి సాయి సీతారామాంజనేయస్వామి దేవస్థానం వద్ద శనివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకుని ప్రతి ఏటా ఈ ఆలయం వద్ద ముగింపు అనంతరం అన్న సమారాధన చేయడం ఆనవాయితీ. భక్తులు పెద్దఎత్తున పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. గౌడ సంఘం కమిటీ సభ్యులు, యువత పర్యవేక్షించారు.

వాహనాల తనిఖీ



మండవల్లి: మండవల్లిలో ఎస్ఐ టి.రామకృష్ణ శనివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహన ధ్రువపత్రాలను తనిఖీ చేసి వాహనదారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక లోడుతో ప్రయాణించరాదన్నారు. లైసెన్స్‌లు, రికార్డులు సక్రమంగా ఉండాలన్నారు. అధిక లోడుతో ప్రయాణిస్తున్న వాహనదారులకు జరిమానా విధించారు. నిబంధనలు పాటించని వాహనదారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బోరు పంపుల ఏర్పాటు



గూడూరు: వేసవి నీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకుని మచిలీపట్నానికి చెందిన నవకాంతి సంస్థ ఆధ్వర్యంలో గూడూరు మండలం తుమ్మలపాలెంలో బోరు పంపులను ఏర్పాటు చేశారు. పాస్టర్ డేవిడ్ రాజు చొరవతో తుమ్మలపాలెంలో నవకాంతి సంస్థ రెండు బోరు పంపులు ఏర్పాటు చేయగా సర్పంచి కోడే రేణుకాదేవి శనివారం ప్రారంభించారు. కొత్త తుమ్మలపాలెంలో మరో రెండు బోరు పంపులు ఏర్పాటు చేస్తున్నామని సంస్థ ప్రతినిధులు పల్లికొండ మణిలాల్, బుస్సా రవి, ఉప్పులేటి సురేష్‌బాబు, కొడాలి నాని తెలిపారు. కార్యక్రమంలో కోడే వెంకటేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

8 మంది జూదరుల అరెస్ట్

పెడన: నడుపూరు గ్రామంలో పేకాడుతున్న ఎనిమిది మందిని శనివారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, సిబ్బంది అరెస్ట్ చేశారు. పేకాడుతున్నట్లు అందిన సమాచారంతో దాడి చేసి 8 మందిని అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.28,190 నగదు, ఐదు ద్విచక్ర వాహనాలు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో రన్ ఫర్ జీసస్



గుడివాడ టౌన్: ఏసుక్రీస్తు సిలువ మరణానంతరం మూడో రోజున మరణాన్ని జయించి సమాధి నుంచి పునరుత్థానమయ్యారు. దీనిని స్మరిస్తూ పట్టణంలోని అన్ని క్రైస్తవ సంఘాలు రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని శనివారం ఉదయం నిర్వహించారు. స్థానిక నాగవరప్పాడు రివైవల్ పెంతికోస్తు చర్చి నుంచి బయలు దేరిన ఈ రన్ ఏలూరు రోడ్డు, నెహ్రూ చౌక్, మార్కెట్ సెంటర్, బస్టాండ్, కోతిబొమ్మ సెంటర్ మీదుగా పామర్రు రోడ్డులోని హోలీ క్రాస్ చర్చి వరకు సాగింది. బిషప్ అప్పికట్ల జాషువా, పలు సంఘాల పాస్టర్‌లు సజ్జా బర్నబాస్, విక్టర్ పాల్, కమల సుధాకర్, జీపీ శేఖర్, లూయిస్‌రాజ్, చంటి, ఎలైజా, యెహెజ్కేల్, ఎలీషా, ఎం.సువర్ణబాబు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలకు చెక్

- రూ.12.29 కోట్లతో ఇంటింటికీ కుళాయి
- కొన్ని చోట్ల పూర్తి...తాగునీరు సరఫరా
- మరి కొన్ని చోట్ల ముమ్మరంగా పనులు
- పెడన నియోజకవర్గంలో జల్‌జీవన్ మిషన్ నిధులతో నిర్మాణాలు



కట్లపల్లిలో ఇంటింటికీ కుళాయి నీటి సరఫరాను పరిశీలిస్తున్న అధికారులు

పెడన: పెడన నియోజకవర్గంలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ చొరవతో జల్‌జీవన్ మిషన్ ద్వారా రూ.12.29 కోట్లతో ముమ్మరంగా పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే కొన్ని చోట్ల పనులు పూర్తికావడంతో పాటు నీటిని విడుదల చేసి పరిశీలించిన అధికారులు సంతృప్తి వ్యక్తంచేశారు. పెడన నియోజకవర్గంలోని పెడనలో రూ.4.15 కోట్లు, గూడూరులో 2.48 కోట్లు, కృత్తివెన్నులో 2.81 కోట్లు, బంటుమిల్లిలో 2.84 కోట్లతో పనులు జరుగుతున్నాయి. కొన్ని చోట్ల పనులు పూర్తి చేసుకున్నాయి. ప్రస్తుతం ఉన్న తాగునీటి చెరువులకు అనుసంధానం చేస్తూ పైపులైన్లు నిర్మించారు. మరికొన్ని చోట్ల నిర్మిస్తున్నారు. ఇదే సమయంలో ఇంటింటికీ కుళాయిలు కూడా వేస్తున్నారు. తాగునీటి పైపులైన్ల నిర్మాణాలు చేపట్టిన ప్రాంతాల్లో ముందస్తుగా ఇంటింటికీ కుళాయి వేయించుకోవాలని పేర్కొంటూ టాంటాం వేయడంతో పాటు ఆ పంచాయతీ పరిధిలోని పాలకులకు వివరించి గ్రామస్తులకు అవగాహన కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టారు. అవసరమైన ప్రాంతాల్లో ఓవర్ హెడ్ ట్యాంకులు, మైక్రో వాటర్ ఫిల్టర్ల ఏర్పాటు పనులు చేపట్టారు.

నిధుల వ్యయం ఇలా..

పెడన నియోజకవర్గం పెడన మండలంలోని అచ్చయ్యవారిపాలెంకు రూ.20 లక్షలు, గొడపాలెంకు రూ.40 లక్షలు, కొంగంచర్లకు రూ.38 లక్షలు, కుమ్మరిగుంటకు రూ.33 లక్షలు, ఈదుమూడికి రూ.38 లక్షలు, కట్లపల్లికి రూ.33 లక్షలు, కొంకేపూడికి రూ.43 లక్షలు, కృష్ణాపురానికి రూ.33 లక్షలు, కూడూరుకు రూ.28 లక్షలు, అగ్రహారానికి రూ.33 లక్షలు, నడుపూరునకు రూ.43 లక్షలు, మెరికేపాలెంకు రూ.33 లక్షల చొప్పున విడుదలయ్యాయి.

- గూడూరు మండలంలోని గండ్రంలో రూ.40 లక్షలు, ఐదుగుళ్లపల్లిలో రూ.20 లక్షలు, కంకటావలో రూ.23 లక్షలు, కత్తులవానిపాలెంలో రూ.20.90 లక్షలు, ఆర్ ఎస్ అగ్రహారంలో రూ.20 లక్షలు, పర్ణశాలలో రూ.35 లక్షలు, తరకటూరులో రూ.50 లక్షలు, తరకటూరుపాలెంలో రూ.9.50 లక్షలు, నారికేండ్లపాలెంలో రూ.30 లక్షలతో నిర్మాణ పనులు చేపట్టారు.
- కృత్తివెన్ను మండలంలోని లక్ష్మీపురానికి రూ.50 లక్షలు, తాడవెన్నుకు రూ.40.50 లక్షలు, చెరుకుమల్లికి రూ.40 లక్షలు, చందాలకు రూ.40 లక్షలు, పెద చందాలకు రూ.37.80 లక్షలు, గరిశపూడికి రూ.30 లక్షలు, యండపల్లికి రూ.25 లక్షలు, గాంధీనగర్‌కు రూ.18 లక్షలు విడుదల కావడంతో పనులు చేపట్టారు. ఇప్పటికే కొన్ని చోట్ల పైపులైన్లు నిర్మాణ పనులు కూడా పూర్తయ్యాయి.
- బంటుమిల్లి మండలంలోని అర్జవానిగూడెంకు రూ.8 లక్షలు, సాతులూరుకు రూ.8.5 లక్షలు, బర్రిపాడుకు రూ.8.8 లక్షలు, మలపరాజుగూడెంకు రూ.18.7 లక్షలు, చినతుమ్మిడికి రూ.58 లక్షలు, ఎస్మాలపల్లికి రూ.58.5 లక్షలు, కంచడంకు రూ.48 లక్షలు, పెందుర్రుకు రూ.48 లక్షల జల్‌జీవన్ మిషన్ నిధులు విడుదలయ్యాయి.

ఆగస్టు చివరికి పూర్తి చేస్తాం



జల్‌జీవన్ మిషన్ కింద ప్రత్యేక ప్యాకేజీ ద్వారా పెడన నియోజకవర్గంలో తాగునీటి పైపుల నిర్మాణంతో పాటు ఇంటింటికీ కుళాయి నిర్మాణ పనులు చేపట్టాం. పెడన నియోజకవర్గంలోని 38 గ్రామాలకు రూ.12.29 కోట్లు విడుదలయ్యాయి. గత ఏడాది 2022 ఆగస్టులో పనులు ప్రారంభించాం. ఈ ఏడాది ఆగస్టు చివరికి పనులు పూర్తి చేయాల్సి ఉంది. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంతో పాటు పరిశీలిస్తున్నాం.

– సీహెచ్ హేమ స్రవంతి, ఇన్‌చార్జి డీఈ, సబ్ డివిజన్ మచిలీపట్నం

పారదర్శకంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- వేటపాలెంలో ఉత్సాహంగా గడప గడపకు మన ప్రభుత్వం



బ్రోచర్ అందజేసి పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

కోడూరు: ప్రతి గడపకు సంక్షేమ ఫలాలను పారదర్శకంగా అందించి ప్రజల్లో జవాబుదారీతనం పెంచిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. కోడూరు–3 సచివాలయ పరిధిలోని వేటపాలెం, దింటిమెరక గ్రామాల్లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లోని 268 ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలును వివరించి బ్రోచర్లను అందించి మరోసారి తమ ప్రభుత్వాన్ని దీవించాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేసే అనేక పథకాల్లో మహిళలను భాగస్వామం చేయడంతో పాటు పిల్లలకు బంగారు భవిష్యత్‌ను అందించేందుకు విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చారన్నారు. నాలుగేళ్ల పాలనలో అన్నివర్గాల ప్రజలకు ఇంటి ముంగిటకే సంక్షేమాన్ని అందించారని వివరించారు. తాగునీటి సరఫరాలో జాప్యం జరుగుతోందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.. సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. అనంతరం వలంటీర్లకు పలు సూచనలు చేశారు. దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు, మండల సచివాలయాల కన్వీనర్ కడవకొల్లు శ్రీనివాసరావు, జిల్లా సంయుక్త కార్యదర్శి కోట పద్మావతి వరప్రసాద్, ఎంపీటీసీలు బడే గంగాధరరావు, మీసాల రాణినాంచారమ్మ, ఎస్సీసెల్ కన్వీనర్ వెన్నా ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

పేర్ని కిట్టు



వాడపాలెంలో మాట్లాడుతున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: మహిళలు ఆర్థికాభ్యున్నతి సాధించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. తుమ్మలపాలెం, వాడపాలెం, వెంకటదుర్గాంబపురం, కేపీటీపాలెం గ్రామాల్లో శనివారం జరిగిన వైఎస్సార్ ఆసరా వారోత్సవాల్లో కిట్టు పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లోని లబ్ధిదారులకు ఆసరా మూడో విడత చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి మహిళల పక్షపాతి అయ్యారన్నారు. ప్రజల్లో ఆయనకు ఉన్న అభిమానమే మరోసారి ముఖ్యమంత్రిని చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బందరు నియోజకవర్గ కన్వీనర్ వాలిశెట్టి రవిశంకర్, ఎంపీడీఓ బాలకృష్ణ, వాడపాలెం సర్పంచ్ మేడిశెట్టి రాజకుమార్, ఎన్ గొల్లపాలెం సర్పంచ్ బండి దేవానందం, వైఎస్సార్ సీపీ నాయకుడు తలారి శ్రీనివాసరావు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

మేలు చేశాం.. అందుకే ఈ ఆదరణ



శ్రీకాకుళంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి



బందరు ఒకటో డివిజన్‌లో కరపత్రాలు అందజేస్తున్న గృహ సారథులు, పేర్ని కిట్టు

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

ఘంటసాల(అవనిగడ్డ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలకు మేలు చేశాం కాబట్టే ప్రజలు ఆదరిస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. ఘంటసాల మండల పరిధి శ్రీకాకుళంలో శనివారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సింహాద్రి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్నివర్గాలకు మేలు చేశాం కాబట్టే ప్రజల మధ్యకు ధైర్యంగా వెళుతున్నామని చెప్పారు. ఎన్ని పార్టీలు కలిసొచ్చినా ఈ సారి మళ్లీ వైఎస్సార్ సీపీకే ప్రజలు అధికారం కట్టబెట్టేందుకు ఎదురు చూస్తున్నారని తెలిపారు. అనంతరం గ్రామంలోని పలు ఇళ్లకు వెళ్లి ఎమ్మెల్యే మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్స్‌ని తలుపులకు, ఫోన్లకు అంటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకుని అభిప్రాయాలు సేకరించారు. ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావు, జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ, సచివాలయ మండల కన్వీనర్ వేమూరి ప్రవీణ్, వైస్ ఎంపీపీ కుంపటి నాగేంద్ర, తెలుగురావుపాలెం సర్పంచ్ ప్రసాద్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు చిట్టూరి రమేష్, సచివాలయ కన్వీనర్లు చిట్టూరి చిట్టితల్లి, సీతారాంబాబు, సనకా శ్రీను, నాయకులు, గృహ సారథులు పాల్గొన్నారు.

మళ్లీ జగన్ పాలనే కావాలంటున్న ప్రజలు

మచిలీపట్నంటౌన్: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి మచిలీపట్నంలో విశేష స్పందన లభిస్తోంది. నగరంలోని 50 డివిజన్లలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వీరు అడుగుతున్న ప్రశ్నలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది. గత టీడీపీ పాలకుల కంటే జగన్ పాలన వెయ్యి రెట్లు అద్భుతంగా ఉందని ప్రజలు బదులిస్తున్నారు. మళ్లీ జగన్‌నే ముఖ్యమంత్రిని చేస్తామని వారు చెబుతున్నారు. నగరంలోని ఒకటో డివిజన్ ఆనందపేట ప్రాంతంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), కార్పొరేటర్ జోగి చిరంజీవితో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు.

పెడనలో..

పెడన: పట్టణంలోని 11వ వార్డులో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బండారు మల్లికార్జునరావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. సచివాలయ కన్వీనర్ ముత్యాల మురళి, గృహ సారథులు మల్లా, జ్యోతి, వలంటీరు మౌనిక పాల్గొని లబ్ధిదారులతో మాట్లాడి వారి అనుమతులతో స్టిక్కర్లను ఇళ్లకు అంటించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కోడూరు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మోపిదేవిలో..

మోపిదేవి: మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం గ్రామాల్లో విస్తృతంగా కొనసాగుతోంది. మోపిదేవిలో సర్పంచ్ నందిగం మేరీరాణి, రావి రాంప్రసాద్ ఆధ్వర్యంలో వలంటీర్లు, గృహసారథులు ఉత్సాహంగా ఇంటింటా జగనన్న అందించిన పథకాలు వివరించారు. లబ్ధిదారుల అంగీకారంతో ఇంటింటా, సెల్ ఫోన్లకు స్టిక్కర్లు అంటించారు. పార్టీ గ్రామ కన్వీనర్ కారుమూరి తాతయ్య, కామిశెట్టి వెంకట సురేష్‌బాబు, గ్రామ సచివాలయ కన్వీనర్లు నందిగం శ్రీనివాసరావు, రంగిశెట్టి లక్ష్మీతిరుపతమ్మ, గొరిపర్తి సుబ్బారావు, నందిగం అశోక్, కారుమూరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో సన్నిహితంగా మెలగాలి

మచిలీపట్నంటౌన్: గృహ సారథులు వారి క్లస్టర్ పరిధిలోని ప్రజలతో సన్నిహితంగా వ్యవహరిస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని 36వ డివిజన్ కార్పొరేటర్ మాచవరపు రాంప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక సచివాలయం వద్ద గృహ సారథులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గృహ సారథులకు పలు సూచనలు చేశారు. కో–ఆప్షన్ సభ్యురాలు మట్టా తులసి, సచివాలయ కన్వీనర్లు జవ్వాది రాంబాబు, దార్ల చెన్నకేశవరావు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం నగర అధ్యక్షుడు షేక్ జలీల్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో అసత్య ప్రచారంపై ఫిర్యాదు

కోనేరుసెంటర్: బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి పార్టీ వీడి వేరే పార్టీలోకి వెళుతున్నట్లు కొన్ని ఆన్‌లైన్ పత్రికలు చేసిన అసత్య ప్రచారంపై ఎంపీ కార్యాలయం నుంచి ఆయన ప్రతినిధి చేవూరి శ్రీనివాసరావు చిలకలపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎంపీ బాలశౌరి పార్టీ మారుతున్నట్లు ఆన్‌లైన్ పత్రికల్లో అసత్య కథనాలు ప్రచురించాయి. విచారణ చేసి ఆయా ఆన్‌లైన్ పత్రికల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని శ్రీనివాసరావు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

200 మందికి వైద్య పరీక్షలు



మచిలీపట్నంటౌన్: మండల ఆర్య వైశ్య మహిళా విభాగం ఆధ్వర్యంలో గొడుగుపేట కొల్లిపర వారి కల్యాణ మండపంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడ కామినేని హాస్పటల్ వైద్యులు 200 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. గుండె, జనరల్, వినికిడి, కంటి, దంత సమస్యలకు వైద్యులు పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆర్య వైశ్య మహాసభ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గుడివాడ గున్నయ్యశెట్టి, ఆర్య వైశ్య మహిళా విభాగం అధ్యక్షురాలు వేముల శిరీష, మండల అధ్యక్షురాలు తుమ్మలపల్లి విశాలాక్షి, కార్యదర్శి సామా అన్నపూర్ణ, కోశాధికారి మాటూరి శ్రీలక్ష్మీ పర్యవేక్షించారు.

విమర్శలు చేసే స్థాయి సుభాష్ చంద్రబోస్‌కు లేదు

జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ

ఘంటసాల(అవనిగడ్డ): ప్రభుత్వంపై విమర్శలు చేసే స్థాయి పరుచూరి సుభాష్ చంద్రబోస్‌కు లేదని జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ అన్నారు. శ్రీకాకుళంలో శనివారం ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. సుభాష్ చంద్రబోస్ పంచాయతీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు టీడీపీకి ఓట్లు వేయించినప్పుడే ఆయన పచ్చజెండా కప్పుకున్నారని, కొత్తగా పార్టీ మారిందేమీ లేదని అన్నారు. రాష్ట్రంలో అమలు జరుగుతున్న సంక్షేమ కార్యక్రమాలు తెలంగాణలో ఉంటున్న సుభాష్‌చంద్రబోస్‌కి ఏమి తెలుసని, గ్రామాల్లోకి వచ్చి చూస్తే అర్థమవుతుందని ఎద్దేవా చేశారు. మండలంలో ఒక్కో ప్రభుత్వ పాఠశాలలో రూ.50 లక్షల నుంచి కోటి మేర అభివృద్ధి పనులు జరిగాయని, మండలంలో ఎక్కడకు వెళ్లి చూసినా ఆయనకు కనబడుతుందన్నారు. ఆర్‌బీకేలు పనిచేయడం లేదని చెప్పడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని, ఆయన పక్కన కూర్చోబెట్టుకున్న బండి రవితేజ పది రోజుల కిందట ఆర్‌బీకే నుంచి ట్రాక్టర్ తీసుకున్నారని, ఆర్‌బీకేలు పనిచేస్తున్నాయో లేదో రవితేజను అడిగి తెలుసుకోవాలన్నారు. గత టీడీపీ హయాంలో ప్రభుత్వ వైద్యశాలలో డాక్టర్లు లేని పరిస్థితి ఉండేదని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నేడు వైద్యులు గ్రామాలకు వెళ్లి ఇంటింటికీ వైద్యసేవలు అందిస్తున్నారని వివరించారు. సచివాలయ మండల కన్వీనర్ వేమూరి ప్రవీణ్, వైస్ ఎంపీపీ కుంపటి నాగేంద్ర, తెలుగురావుపాలెం సర్పంచ్ ప్రసాద్‌బాబు, నాయకులు చిట్టూరి రమేష్ పాల్గొన్నారు.

పండగలా 'మా నమ్మకం నువ్వే జగన్'

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



దింటిమెరకలో స్టిక్కర్ అంటించి పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

కోడూరు: 'జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని ఊరువాడా పండుగలా నిర్వహించాలని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో రమేష్‌బాబు దింటిమెరక గ్రామంలో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ నెల 20వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, కన్వీనర్లు, గృహ సారథులు పార్టీ నేతలను కలుపుకొని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించాలని సూచించారు. ఇంటి యాజమానుల అనుమతి అడిగి డోర్, మొబైల్స్‌పై స్టిక్కర్లు అతికించాలని, ఎవరినీ ఇబ్బంది పెట్టవద్దని చెప్పారు. ప్రభుత్వానికి మద్దతు తెలిపే వారు 8296082960 నెంబర్‌కు మిస్డ్‌కాల్ ఇచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. దింటిమెరక గ్రామంలో రమేష్‌బాబు మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామంలోని పలు ఇళ్లకు వెళ్లి స్టిక్కర్లు అంటించి, ప్రజలకు సంక్షేమ పథకాలను వివరించారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, సచివాలయాల మండల కన్వీనర్ కడవకొల్లు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, ఎస్సీసెల్ జిల్లా కన్వీనర్ గుర్రం బసవయ్య, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



కమ్యూనిటీహాల్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ బాలశౌరి, మంత్రి జోగి రమేష్

గూడూరు: గూడూరు మండలంలో రూ.1.02 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు మంత్రి జోగి రమేష్, బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి శనివారం భూమిపూజ చేశారు. మండలంలోని తరకటూరులో రూ.32 లక్షల ఎంపీ నిధులతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ పనులకు ఎంపీ వల్లభనేని బాలశౌరి, మంత్రి జోగి రమేష్ భూమి పూజ నిర్వహించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. గూడూరులో ఎన్‌హెచ్ 65 నుంచి గూడూరు తహసీల్దార్ కార్యాలయం వరకు రూ.70 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, ఎంపీటీసీ సభ్యుడు జక్కా ధర్మారాయుడు, ఆయా గ్రామాల సర్పంచులు చిన్నం వెంకట రమణమ్మ, లింగం సులోచనారాణి, పీఏసీఎస్ చైర్మన్లు గళ్లా నాంచారయ్య, తలుపుల వెంకట కృష్ణారావు, వైఎస్సార్ సీపీ నాయకులు గొరిపర్తి రవికుమార్, కారుమంచి కామేశ్వరరావు, అంబటి కాంతారావు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ



ప్రోత్సాహకాలు అందిస్తున్న కిరణ్‌కుమార్

పెదముత్తేవి (మొవ్వ): విజయవాడ ఎనికేపాడులోని ఓ హోటల్‌లో ఎస్‌సీఈఆర్‌టీ, ఎస్ఎస్ఏ, మరో 8 ఎన్‌జీవో సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో గత నెల 28న నిర్వహించిన వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి రాష్ట్ర స్థాయి ప్రదర్శనలో పెదముత్తేవి శ్రీలక్ష్మీపతి స్వామి సంస్కృతోన్నత విద్యాలయం విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. పర్యావరణ హిత పెన్నులు అనే అంశాన్ని విద్యార్థులు ప్రదర్శించగా శనివారం నిర్వాహకుల్లో ఒకరైన ఈఎండీసీ మేనేజర్ కిరణ్ కుమార్ పెదముత్తేవిలోని పాఠశాలకు వచ్చి ప్రోత్సాహక బహుమతిని, నగదును హెచ్ఎం కె. మాధవికి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎంబీఎల్ఎం సీతారాం గురూజీ, విద్యా కమిటీ చైర్మన్ ముత్తేవి గౌర కృష్ణ, సైన్స్ ఉపాధ్యాయులు కె. రాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు వృద్ధుల వైద్య గృహం ప్రారంభం



ప్రారంభానికి సిద్ధమైన భవనం

గుడివాడ టౌన్: పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన జిర్యాటిక్ వార్డు (వృద్ధుల వైద్యగృహం) ప్రారంభోత్సవం ఆదివారం నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు జరిగే ఈ కార్యక్రామానికి ముఖ్యఅతిథులుగా ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే కొడాలి వెంకటేశ్వరరావు పాల్గొని ప్రారంభిస్తారు. పట్టణంలో ఈ విభాగాన్ని ఏర్పాటు చేయడంలో బందరు ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే కొడాలి నాని చూపిన చొరవ అభినందనీయమని స్థానికులు అంటున్నారు. సుమారు రూ.80 లక్షలతో నిర్మించిన ఈ భవనంలో 10 బెడ్‌లు ఉంటాయి. 60 ఏళ్లు పైబడిన వృద్ధులు, కదలలేక అనారోగ్యంతో బాధపడే వారికి వ్యాధి నయం అయ్యే వరకు ఇక్కడే చికిత్స అందిస్తారు. వారికి కావలసిన భోజనంతో పాటు అన్ని సౌకర్యాలు ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. ఈ విభాగంలో ప్రత్యే క డాక్టర్ సేవలందిస్తారు. వృద్ధుల వైద్య గృహం వల్ల ఎంతోమందికి మేలు జరుగుతుందని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎంపీ నారాయణరెడ్డి తెలిపారు.

వంశీకృష్ణ మృతికి ఎంపీ బాలశౌరి, మంత్రి జోగి రమేష్ సంతాపం



వంశీకృష్ణ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ బాలశౌరి, మంత్రి జోగి రమేష్

కృత్తివెన్ను: కృత్తివెన్ను ఎంపీపీ కూనసాని గరుడ ప్రసాద్ కుమారుడు వంశీకృష్ణ (26) ఈ నెల 5వ తేదీ రాత్రి మునిపెడ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. బంటుమిల్లి నుంచి ఆయన స్వగ్రామమైన కొమాళ్లపూడికి బైక్‌పై వస్తుండగా జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని విజయవాడ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఆయన భౌతికకాయాన్ని కొమాళ్లపూడికి తీసుకువచ్చి శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్, మాజీ డెప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్, మంత్రి తనయులు జోగి రాజీవ్, జోగి రోహిత్, పెడన నియోజవర్గ ప్రజాప్రతినిధులు, ప్రజలు వంశీకృష్ణ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.